క్లుప్తంగా

లాలునాయక్ సేవలు మరువలేనివి

దేవరుప్పుల: ధర్మాపురం రెవెన్యూ పరిధి గిరిజన తండాల అభివృద్ధి కోసం పాటుపడిన సర్పంచ్ లాలునాయక్ సేవలు మరువలేనివని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, మండల సమన్వయకర్త పల్ల సుందర్‌రామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సీత్యతండాలో మాజీ సర్పంచ్ భూక్యా లాలునాయక్ వర్ధంతిని పురస్కరించుకొని నిర్మించిన స్మారక చిహ్నానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. సర్పంచ్‌లు మంజుల వీరన్న, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఉపేందర్, ఉపసర్పంచ్ సీమానాయక్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గుగులోతు రవి, మాజీ ఎంపిపి కొల్లూరి సోమన్న, మార్కెట్ వైస్ చైర్మన్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం



జఫర్‌గఢ్: ఆర్బీఐ ఇటీవల నిర్వహించిన మండల స్థాయి క్విజ్ పోటీలో ప్రతిభ కనబరిచిన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చాడ గణేష్‌రెడ్డి మాట్లాడుతూ మండల స్థాయి పోటీ పరీక్షలో పాఠశాలకు చెందిన విద్యార్థులు హారిక, శ్రేయ అత్యుత్తమ ప్రతిభను కనబర్చి ప్రథమ బహుమతి సాధించారన్నారు. వీరు జిల్లా స్థాయి క్విజ్ పోటీలో కూడా ప్రతిభను కనబర్చాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు శ్రవణ్‌కుమార్, వేణుగోపాల్, బాల ప్రతాప్‌రెడ్డి, శ్రీలత, సుస్మిత పాల్గొన్నారు.

ఆర్థికసాయం



దేవరుప్పుల: మండలంలోని కోలుకొండలో ఇటీవల మృతి చెందిన కన్న శ్రీనివాస్ కుటుంబానికి బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ సహకారంతో రూ.10 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. నిరుపేద కుటుంబాలకు బాసటగా నిలుస్తున్న శ్రీకాంత్‌గౌడ్ దాతృత్వాన్ని పలువురు అభినందించారు. కారుపోతుల శ్రీనివాస్, రైతు కోఆర్డినేటర్ కోతి ప్రవీణ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గనుపాక ఎల్లేష్, బీఆర్ఎస్ యువజన నాయకులు కోతి ప్రవీణ్ గౌడ్, భాష్యంపెల్లి కొమురెల్లి,గ్రామ కోఆప్షన్ సభ్యులు కన్న రామ్మూర్తి, యామగాని ఎల్లయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను రక్షించాలి

బచ్చన్నపేట: మండలంలోని అన్ని వన నర్సరీల్లో వంద శాతం మొక్కలను రక్షించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ భూముల్లో, రైతుల పొలం గట్లపై మొక్కలను నాటాలన్నారు. మొక్కలు అవసరం ఉన్న రైతులు ఆయా గ్రామాల వన నర్సరీల వద్దకు వెళ్లాలని సూచించారు.

రోకలిబండతో కొట్టి..

భర్తను హత్య చేసిన భార్య

- వివరాలు వెల్లడించిన ఎస్సై ప్రవీణ్

లింగాలఘణపురం: భర్త వేధింపులు భరించలేక భార్య రోకలిబండతో ఛాతిపై కొట్టి, మోకాళ్లతో గుద్ది చంపింది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గత ఏడాది అక్టోబర్ 6న లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన కన్నా వెంకటేశ్ మృతి చెందడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం వెంకటేశ్ భార్య కన్నా రేణుక భర్త వేధింపులు భరించలేక రోకలిబండతో ఛాతిపై కొట్టి, మోకాళ్లతో గుద్ది చంపినట్లు రఘునాథపల్లి సీఐ సంతోష్ సమక్షంలో నేరాన్ని అంగీకరించారు. దీంతో రేణుకను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామని ఎస్సై తెలిపారు.

పశువుల పట్టివేత

రఘునాథపల్లి: ఐనవోలు అంగడిలో పశువులను కొనుగోలు చేసి ట్రాలీలో హైదరాబాద్‌కు కోతకు తరలిస్తుండగా మండలంలోని కోమళ్ల టోల్‌గేట్ వద్ద పోలీసులు పట్టుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై సీహెచ్ రఘుపతి కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని అంగడిలో హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ అతని కుమారుడు ఓవైసీలు మూడు గేదెలు, ఏడు దున్నపోతులను కొనుగోలు చేసి ట్రాలీలో హైదరాబాద్‌కు కోతకు తరలిస్తుండగా కోమళ్ల టోల్‌గేట్ వద్ద పట్టుకున్నామన్నారు. అక్రమంగా పశువులను తరలిస్తున్న తండ్రీ కొడుకులతో పాటు ట్రాలీ డ్రైవర్ బండారి శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి

- జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి మాట్లాడుతున్న సంపత్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ దేశ ప్రగతికి పల్లెలే పట్టుకొమ్మలనే నినాదంతో గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్ రెడ్డి అన్నారు. మండలంలోని సముద్రాల శివారు గుంటూరుపల్లిలో రూ.10లక్షలు ఎంఎన్ఆర్ఈజీఎస్ పథకం నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ద్వారానే గ్రామాల సమగ్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు. పల్లెప్రగతితో గ్రామాలను అన్ని విధాల అభివృద్ధి చేశారన్నారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ లూజ్ లైన్ల సమస్యలను పరిష్కరించి గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి పనిచేస్తున్నారన్నారు. సర్పంచ్ గుండె విమలనర్సయ్య, నాయకులు గోవు జేమ్స్‌రెడ్డి, రత్నారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పడిశాల వెంకటేష్, హరిప్రసాద్, రాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలన్నీ కేంద్రానివే..



నర్మెట: కేంద్ర పథకాలను వివరిస్తున్న శ్రీనివాస్

నర్మెట: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలన్నీ కేంద్రం అందిస్తున్న నిధులేనని బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ బల్లా శ్రీనివాస్ అన్నారు. మహాజన సంపర్క్ యోజన కార్యక్రమంలో భాగంగా మండలంలోని అమ్మాపురం, డీసీ తండా, మనుబోతుల తండాలలో మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ రాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం ఇంటింటికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలకోట్ల నిధులను మోదీ ప్రభుత్వం తెలంగాణకు ఇస్తున్నా అభివృద్ధిని మరచిన కేసీఆర్ ప్రభుత్వం కేంద్రంపై బురదజల్లే పనిని చేపట్టడం విచారకరమని అన్నీ గమనిస్తున్న తెలంగాణా ప్రజలు రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. దేశంలో 12 కోట్ల మరుగుదొడ్లను నిర్మించిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కిందని, కోవిడ్ సమయంలో 20 కోట్ల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో నెలకు రూ. 500 వేసింది, గ్రామ పంచాయతీల అభివృద్ధికి 90 శాతం నిధులు కేంద్రానివేనన్న విషయం గమనించాలని అన్నారు. సింగిల్ సివిల్ కోడ్‌కు మద్దతుగా 90909 02024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు గంగం ప్రభాకర్‌రెడ్డి, నవీన్, మనోజ్, సాయినాథ్, మోహన్ బాషా, అవినాష్, అరవింద్, భూక్య శ్రీనివాస్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాణిక్యాపురంలో ఇంటింటికీ బీజేపీ

లింగాలఘణపురం: మండలంలోని మాణిక్యాపురంలో బుధవారం బీజేపీ మహజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ బీజేపీ అనే కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ దూసరి విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నాయకులు రాజేష్, ప్రశాంత్, హరీష్, ఉపేందర్, కరుణాకర్, శ్రీకాంత్, అజయ్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

మేరు కులస్తులను ఆదుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ రూరల్: సమాజంలో వెనుకబడిన మేరు కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని మేరుగు సంఘం జిల్లా నాయకుడు రాపర్తి సుధాకర్ అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ సీహెచ్ శివలింగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేరుగు ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని బీసీ లోన్ కింద మేరు కులస్తులను చేర్చాలని అన్నారు. పాఠశాల విద్యార్థులకు దుస్తులు కుట్టేందుకు అవకాశం ఇవ్వాలని అన్నారు. ఉచితంగా కుట్టు మిషన్‌లు అందించి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. మొదటి సారిగా బీసీల కింద ప్రభుత్వం గుర్తించిందన్నారు. బీసీ లోన్‌కింద మేరు కులస్తులకు రుణాలు ఇవ్వాలని అన్నారు.రాపర్తి కిషోర్, ప్రశాంత్, విష్ణు, శ్రావన్, సత్యనారాయణ, మురళి, యాదగిరి, రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లకు విద్యుత్ కట్



సమయం కావాలని విద్యుత్ సిబ్బందిని కోరుతున్న వినియోగదారులు

నర్మెట: మండలంలోని వెల్దండలో గత రెండేళ్ల క్రితం నిర్మాణాలు పూర్తిచేసుకున్న 50 డబుల్ బెడ్రూం ఇళ్లను ఇటీవలే ఆధికారులు లబ్ధిదారులకు కేటాయించారు. కాగా విద్యుత్ బిల్లులు రూ.1,745 రావడంతో బిల్లు అధికంగా వచ్చిందని లబ్ధిదారులు చెల్లించలేదు. దీంతో బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని అధికారులు తెలుపగా సమయం కావాలని వినియోగదారులు కోరినా వినిపించుకోకుండా బుధవారం సాయంత్రం సరఫరా నిలిపివేశారు. అనంతరం కొందరు వినియోగదారులు బిల్లులు చెల్లించగా మరికొందరు సమయం కావాలని కోరినట్లు సమాచారం. దీంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

బియ్యం అందజేత

బచ్చన్నపేట: చిన్నరామన్‌చర్లలో ఇటీవల మృతి చెందిన గాదెపాక సిద్దిరాములు కుటుంబానికి బీఆర్ఎస్‌నాయకుడు ఆజామ్ 50 కిలోల బియ్యాన్ని బుధవారం అందించారు. బుషిగంపల చంద్రయ్యగౌడ్, గాదెపాక లక్ష్మి, భిక్షపతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి



చిల్పూరు: ఇంటింటి ప్రచారంలో రజని

చిల్పూరు: కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గాజుల రజని పిలుపునిచ్చారు. మండలంలోని లింగంపల్లిలో బుధవారం పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు గ్రామ శాఖ అధ్యక్షుడు కంకటి నరేందర్ అధ్యక్షతన రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ కాంపిటీషన్‌పై అవగాహన సదస్సు, పార్టీ బలోపేతంపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు కండ్లకోలు బాలరాజు, రడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పోరాటానికి సిద్ధంగా ఉండాలి

చిల్పూరు: విద్యార్థుల సమస్యలపై పోరాటానికి ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభిగౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద బుధవారం మండల అధ్యక్షుడు భీమగోని పవన్ గౌడ్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిగౌడ్ మాట్లాడారు. అనంతరం రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ కాంపిటీషన్‌పై అవగాహన కల్పించారు. నియోజకవర్గం అధ్యక్షుడు షేక్ జానీ, నాయకులు జంగిటి విక్రమ్, సాదం గట్టయ్య, మంతెన లవన్‌కుమార్, నారగోని పరమేశ్వర్, సాంబారి రాజేశ్వర్, సట్ల రంజిత్, హరి, గోపి, ప్రేమ్, రాకేష్, కోరమేష్, కనుకరాజు, కిష్టయ్య రాహుల్, రోహిత్, శ్రీజన్ పాల్గొన్నారు.

నేలపోగులలో..

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగులలో బుధవారం రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ యూత్ కాంపిటీషన్‌పై ఎంపీటీసీ గుగ్గిళ్ల నర్సయ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య, నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి, నేలపోగుల ఉపసర్పంచ్ ఆవుల ఎల్లమ్మ, నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొడకండ్ల: మండలకేంద్రంలో నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా కూడా అర్హులైన పేదలకు పంపిణీ చేయడం లేదని వెంటనే వాటిని అర్హులకు అందించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో పూర్తయిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద వారు మాట్లాడుతూ చెన్నూరు రిజర్వాయర్ పనులు నేటికీ పూర్తి కాలేదని, ప్రభుత్వ డిగ్రీ, ఐటీఐ కళాశాలలు లేవని, బయ్యన్న వాగుపై బ్రిడ్జి, కొడకండ్ల–అవుతాపురం రోడ్డు పనులు, సబ్ రిజిస్ట్రార్ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయని అన్నారు. వెంటనే అసంపూర్తి పనులు పూర్తి చేయడంతో పాటు అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు అందించాలని వారు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమనర్సయ్య, రవీందర్, యాకన్న, శ్రీనివాస్, మనోహర్, వంశీకృష్ణ, హరిచందర్, హరగోపాల్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం



బీపీ మిషన్లను పంపిణీ చేస్తున్న సిద్ధార్థరెడ్డి

బచ్చన్నపేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తుందని మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆయా గ్రామాలకు మంజూరు అయిన బీపీ చెకింగ్ మిషన్లను ఏఎన్ఎంలకు అందజేశారు. వైద్య సిబ్బంది శ్వేత, శ్రీనివాస్, దివ్య, శిరీష, ప్రణీత, ప్రసన్న, పద్మ, సంతోష, జ్యోతి, స్వాతి, రజిత, సంపూర్ణ, సుభాషిణి, సునంద, తిరుపతమ్మ, అనిత పాల్గొన్నారు. అనంతరం వైద్యులు సిద్ది సుదర్శన్‌రెడ్డి, సంతోషిరెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేశారు. డీఎంహెచ్ఓ ప్రశాంత్, డాక్టర్ అశోక్‌కుమార్, సిద్దార్థరెడ్డి, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై రాజకీయ కక్ష సాధింపు మానుకోవాలి



మాట్లాడుతున్న కళింగరాజు

జనగామ రూరల్: ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై రాజకీయ కక్ష సాధింపు మానుకోవాలని, అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని జనగామ ఎంపీపీ మేకల కళింగరాజు అన్నారు. బుధవారం జనగామలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్‌లో పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేను రాజకీయంగా ఎదుర్కోలేక అతని కూతురు తుల్జాభవానీని అడ్డం పెట్టుకొని రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. ప్రజల కోసం పని చేసే నాయకుడు ముత్తిరెడ్డి అని, ఆయనపై ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి పొందాలనుకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బి.యాదగిరి, మండల రైతుబంధు కోఆర్డినేటర్ భూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్, అజ్మీరా స్వామి నాయక్, శంకర్, రాజు పాల్గొన్నారు.

ఐలమ్మ విగ్రహాన్ని నెలకొల్పాలి

పాలకుర్తి టౌన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ విగ్రహాన్ని నెలకొల్పాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏదునూరి మదార్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఐలమ్మ పని విధానం ఆచరణీయమని అన్నారు. గతంలో వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు చిట్యాల ఐలమ్మ పోరాటపటిమను ప్రజల కు వివరించడం కోసం ఏర్పాటు చేసిన విగ్రహం తొలగించారని తెలిపారు. మళ్లీ తిరిగి ప్రతిష్ఠించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయండి



జనగామ రూరల్: నివాళులర్పిస్తున్న మనవతారాయ్ తదితరులు

జనగామ రూరల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి మానవతారాయ్ అన్నారు. బుధవారం నియోజకవర్గ కార్యాలయంలో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందని, తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. జనగామలో ముత్తిరెడ్డిని ఓడించి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. జూలై 2వ తేదీన నిర్వహించే ఆన్‌లైన్ క్విజ్ పోటీలను విజయవంతం చేయాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ, పట్టణ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, వివిధ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పీవీ నర్సింహారావు జయంతి

పాలకుర్తి: పీవీ జయంతిని మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాయకులు అనుముల మల్లారెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసు హరీష్, ఎస్టీ సెల్ నాయకుడు భాస్కర్, ఎస్సీ సెల్ భాస్కర్, ఉపాధ్యక్షుడు భార్గవ్, అశోక్, మహేందర్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు కడియం శ్రీహరికి లేదు'



విలేకరులతో మాట్లాడుతున్న దిలీప్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి ఎంతమాత్రం లేదని యూత్‌కాంగ్రెస్ రాష్ట ప్రధాన కార్యదర్శి కీసర దిలీప్‌రెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జఫర్‌గఢ్‌లో కడియం మంగళవారం విలేకర్లతో దేవాదుల పునాది తాను వేశానని, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నిధులు కేటాయించలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ పనులు చేసినట్లు శ్రీహరి చెప్పడం సిగ్గుచేటన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నీటిపారుదలశాఖ మంత్రిగా ఉండి ఒక్క తట్ట మట్టి కూడా తీయని కడియం ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనులు జరిగినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పనులు పక్కన పెడితే అనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో పనులు చేసిన విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. విమర్శలు చేసే ముందు ఆత్మవిమర్శ చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నర్మెట: మండలంలోని పలుతండాలకు సరైన రోడ్డు సౌకర్యాలు లేక గిరిజన మహిళలు విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మండల సేవాలాల్ సేన బుధవారం కలెక్టర్ సీహెచ్. శివలింగయ్యను కలిసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా సేన జిల్లా అధ్యక్షుడు శంకర్, మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ రమేష్ మాట్లాడుతూ రత్నాతండా, బద్యతండా, కన్నెబోయినగూడెం ధరావత్ తండాకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గత పదేళ్లుగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించామని, ముఖ్యమంత్రి కేసీఆర్ తండాలను పంచాయతీలుగా చేసిన ఫలితం కూడా లేకుండా పోయిందని అన్నారు. ప్రమాదసమయంలో 108 వాహనాలు రావడానికి కూడా వీలుగా లేదని ఒక్కసారి పరిస్థితిని చూసి తక్షణం చర్యలు చేపట్టాలని వారు కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్, మండల ఉపాధ్యక్షుడు సుమన్, సభ్యులు రామన్, మోహన్, అనిల్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో చేర్పించండి



పాఠశాలకు ఫ్యాన్ అందజేస్తున్న ప్రణీత

చిల్పూరు: ప్రభుత్వ బడిలో తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలని సర్పంచ్ అరూరి ప్రణీతప్రదీప్ కోరారు. మండలంలోని వంగాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బుధవారం సర్పంచ్ ఆధ్వర్యంలో ఫ్యాన్ బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో చేరితే ప్రభుత్వం అందించే వాటితోపాటు సొంత ఖర్చులతో సౌకర్యాలు కల్పిస్తానని అన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. హెచ్ఎం జ్ఞానసుందర్, టీచర్ మాధవి, పంచాయతీ కార్యదర్శి తిరుమలరెడ్డి, చిట్యాల దయాకర్, భాగ్యలక్ష్మి, మహ్మద్ గోరేమియా పాల్గొన్నారు.

నిరుపయోగంగా వసతి గృహం



నిరుపయోగంగా ఉన్న వసతి గృహం

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరక ముందే గ్రామ పంచాయతీకి అప్పగించాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. దాదాపు 22 ఏళ్ల క్రితం అప్పటి సమితి ప్రెసిడెంట్ రాజేశ్వర్‌రెడ్డి నిరుపేద బీసీ విద్యార్థుల వసతి కోసం సొంత స్థలంలో విశాలమైన గదులతో భవనాన్ని నిర్మించారు. కాగా, గత నాలుగేళ్లుగా ఈ భవనం నిరుపయోగంగా ఉంటోంది. ప్రస్తుతం గ్రామంలో ఉన్న జీపీ భవనం ఇరుకుగా ఉంది. దీంతో పాటు ఆరోగ్య ఉప కేంద్రం, గ్రంథాలయం, ఐకేపీ మహిళా సంఘాలవారు సమావేశాలు నిర్వహించుకునేందుకు వసతి గృహం అనువుగా ఉంటుందని ప్రజలు అంటున్నారు. వసతి గృహం శిథిలావస్థకు చేరుకోక ముందే గ్రామ పంచాయతీకి అప్పగించాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

పోలీస్ కళాజాతా

జనగామ రూరల్: మండలంలోని ఎల్లంలలో మంగళవారం రాత్రి సీపీ రంగనాథ్ ఆదేశాల మేరకు పోలీస్ కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రుక్మాచారి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల అనేక అనర్థాలు ఉంటాయని వాటిని అరికట్టాలని అన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు విలియం, వెంకటేశ్వర్లు, రత్తయ్య, శ్రీనివాస్, చిరంజీవి ఉపసర్పంచ్ అంజయ్య, పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్‌కు తరలింపు

జనగామ రూరల్: గత వారం రోజుల పాటు జిల్లాలో లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. కాగా, 66 మందికి కంటి ఆపరేషన్ అవసరాన్ని గుర్తించి అందులో 42 మందిని బుధవారం హైదరాబాద్ ఎంఎస్ రెడ్డి కంటి ఆస్పత్రికి తరలించారు. ఆపరేషన్ అనంతరం జనగామకు రాగా వారికి ఆరోగ్య సూచనలు చేసి ఉచితంగా కంటి అద్దాలు, మందులు అందజేశారు. జైన రమేష్, తిరుపల్లి కృష్ణారెడ్డి, సంజీవ రెడ్డి, అనిత, నరేందర్ పాల్గొన్నారు.

నేత్రాల సేకరణ

జనగామ రూరల్: పట్టణంలోని గీత నగర్‌కు చెందిన రామానుజమ్మ (70) మృతి చెందింది. కాగా, లయన్స్ జనగామ వనితా క్లబ్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల అనుమతి మేరకు బుధవారం ఆమె నేత్రాలను సేకరించారు. అనంతరం వాటిని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి హైదరాబాద్‌కు తరలించారు. కుమారుడు రవీంద్ర చారి, లయన్స్ ప్రతినిధులు ప్రమోద్‌కుమార్, ఉప్పలయ్య, కృష్ణజీవన్ బజాజ్, బాబు, హరినాథ్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు



తరిగొప్పుల: ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నించిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ బుధవారం తెలిపారు. మండలకేంద్రంలోని సర్వేనంబర్ 844లోని ప్రభుత్వ భూమిలో గతంలో హద్దురాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అట్టి భూమిని పింగిళి సోమిరెడ్డి, బూస కనకయ్య ట్రాక్టర్‌తో చదును చేయడంతో తహసీల్దార్ బాశెట్టి హరిప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అట్టి భూమిని తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. పోలీస్ సిబ్బంది విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.